# మరో సమిధ!



* రచన: శ్రీమతి పచ్చిగోళ్ళ సుధ *

"అమ్మా...అమ్మా! ముద్దుముద్దుగా పిలిచింది మూడేళ్ళ శైలజ..

'ఏమిటమ్మా శైలూ...! ఇప్పుడే గదా ఆడుకుందుకు వెళ్ళావు అప్పుడే వచ్చేశావేం?' అంటూ శైలజను దగ్గరకు తీసుకుంది స్వప్న.

'మరేమో...మ...రేమో...అల్లంతా ఆడుకోడానికి తమ్ముళ్ళి తెచ్చుకున్నారు. నాకూ తమ్ముడు కావాలి!" మారాం చేసింది శైలజ.

ఆ మాటలు విన్న స్వప్న చకితురాలయింది. ఒళ్ళంతా చెమటలు పోశాయి. శైలజ మరోసారి పిలవడంతో తనని తాను సర్దుకుని, ముఖానికి నవ్వు పులుముకుని-

'అమ్మా...శైలూ! ఆడుకోడానికి బోల్డన్ని బొమ్మలున్నాయి. అన్నీ ఇస్తాను. చక్కగా ఆడుకోవాలి. ఏమ్మా?' అంది నెమ్మదిగా.

'ఊఁ' అంది తలాడిస్తూ శైలజ.

స్వప్న లోపలకు వెళ్ళింది. శైలజ తల్లి తెచ్చే బొమ్మల కోసం ఆత్రంగా ఎదురు చూడసాగింది. బొమ్మలు నిండిన బుట్టతో ఎదురయింది స్వప్న. రకరకాల బొమ్మలు చూసే సరికి ఆ చిన్నారి మనసు సంతోషంతో ఉరకలు వేసింది. నచ్చిన బొమ్మలను చిన్ని చేతుల్లో యిరికించింది శైలజ. తల్లికి టాటా చెప్పి పరుగుతీసింది.

స్వప్న ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. అమ్మా శైలూ! నీకెలా చెప్పనురా? ఈ అమ్మ ఎప్పటికీ నీకు తమ్ముడ్ని ఇవ్వలేదని చెప్పమంటావా? శైలూ! నీ తల్లి పూర్తిగా ఓడిపోయింది. ఆ ఆదర్శాలు అగాధానికి కూరుకుపోయాయి. ఆడది అబలకాదు. సబలని గొంతెత్తి చెప్పిన నేను అబలగానే మిగిలిపోయానమ్మా! కేవలం నీ కోసం బ్రతుకుతున్న జీవచ్ఛవాన్ని. ఎలా చెబితే నీ చిన్నిమనసు అర్థం చేసుకోగలదు? అలా తనలో తనే అనుకుంటూ కళ్ళలో వూరిన నీటిని కొంగుతో అద్దుకుంది.

మాతృత్వం ఎంత గొప్పది! ఎంత అపురూపమయినదీ! ఎంత అతీతమయినదీ! ఈ భూమ్మీద పుట్టిన ప్రతిజీవి సృష్టికి మూలకారణం స్త్రీయే! ప్రతి స్త్రీ తల్లికావాలని కోరుకుంటుంది. 'అమ్మా' అనే పిలుపుకోసం ఎంతటి త్యాగమైనా చేస్తుంది. ఎన్ని బాధలయినా భరిస్తుంది. మాతృత్వం కోసం పరితపిస్తుంది. కాని...కాని తను అలాంటి త్యాగం ఎందుకు చేయలేకపోయింది? తనకి మాతృప్రేమ పొందాలని లేదా? నో...నో ఉంది...ఉంది! మనసుని చంపుకుని పశువుకు బలికాలేక పోతోంది.

అలా ఎన్నో రకాలుగా తనను తానే ప్రశ్నించుకుంది. మూగగా రోదించింది. తన జీవితంలో జరిగిన సంఘటనలు తను గడిపిన జీవితం గుర్తుకు వచ్చింది. తనకు తనే తన జీవితాన్ని చెప్పుకోసాగింది.

* * *

ఆ రోజు అక్కని చూచుకోడానికి పెళ్ళివారు వస్తున్నారు. అమ్మ చాలా హడావడి పడిపోయింది. అక్క ముఖంలో సిగ్గు, అప్పుడే పెళ్ళికళ వచ్చినట్టుగా వుంది. నన్ను కాలేజీ మానేసి తనతో సాయంగా వుండమంది

అమ్మ. కాబోయే బావగారు ఎలా వుంటారో చూడాలన్న ఆతృతతో కాలేజీకి నామంపెట్టి, అమ్మకు వంటలోనూ, అక్కకు ముస్తాబులోనూ సాయం చేయసాగాను.

సాయంత్రం నాలుగు గంటలు కావడంతో పెళ్ళివారు హుందాగా లోపలికి అడుగుపెట్టారు. సూటు, బూటు వేసుకుని పెళ్ళికొడుకు ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు.

కనీసపు మర్యాదలు అయ్యాక 'పెళ్ళికూతుర్ని తీసుకు రండి!' అంటూ వాళ్ళ తరపు పెద్దాయన భుజంమీది కండువా సర్దుక్కూర్చున్నాడు. పెళ్ళికూతురు అతన్నే చూస్తుందేమోనన్నట్లుగా -

అక్కను, అమ్మ దగ్గరుండి, చేయిపట్టుకుని మరీ తీసుకువెళ్ళి వాళ్ళకు ఎదురుగా కూర్చోబెట్టింది.

నాకు నవ్వు ఆగలేదు, ఎంత మూఢాచారాలు? ఈ మనుషులు ఎప్పటికీ మారరు. అమ్మ పట్టుకోకపోతే అక్క నడవలేదా? అక్కకూడా అలాంటిదే! అదే నేనయితేనా రాణిలాగా నడుచుకుంటూ వెళ్ళి మహారాణిలా ఫోజుపెట్టి కూర్చుందును. తన ఆలోచనలకు తనే సిగ్గుపడింది.

'నీ పేరేమిటమ్మా?' అక్కను ప్రశ్నించింది ఒకామె.

'సుశీల' అతి నెమ్మదిగా చెప్పింది అక్క.

'ఏం చదువుకున్నావు?' మళ్ళీ ఆమే అడిగింది.

'పదవ తరగతి చదువుకున్నానండి!' పాత చింతకాయ పచ్చడిలా ముఖంపెట్టి చెప్పింది అక్క.

'నీకు పాటలు, డాన్స్‌లు, వంటా వార్పులు వచ్చా?' అంది ఆమె.

వంట వచ్చండీ!' అతి వినయంగా చెప్పింది అక్క.

ఇవన్నీ కిటికీలోనుండి చూస్తూ గమనిస్తున్న నాకు ఒళ్లు మండింది. అడుగు ముందుకు వేశాను. 'ఏ పరిస్థితుల లోనూ నువ్వు వాళ్ళకు కనిపించకూడదమ్మా జాగ్రత్త!' అంటూ హెచ్చరించిన అమ్మ మాటలు గుర్తుకువచ్చి, అమ్మను బాధపెట్టడం ఇష్టంలేక ఆగిపోయాను. వాళ్ళ మాటలు వింటూ అక్కడే నిలబడిపోయాను.

అక్కయ్య నచ్చిందేమో! అత్తగారు కట్నం సంగతులు వరకూ వచ్చింది.

'వదినగారూ! మరిఅమ్మాయికి కట్నం ఎంత ఇస్తారు?'

అమ్మ, ఏమి చెబుతుందోనని చెవులు మరింత విశాలం చేసుకుని వినసాగాను. అమ్మకూడా 'వదినగారూ' అంటూ మొదలుపెట్టింది.

పిల్లల చిన్నతనంలోనే వాళ్ళ నాన్నగారు నన్ను ఒంటరి దాన్ని చేసి వెళ్ళిపోయారు. పరిస్థితుల కారణంగా దీన్ని పెద్ద చదువులు చదివించలేకపోయాను. మా రెండో అమ్మాయి పట్టుదలతో చదువుకుంటోంది. ఈ ఇల్లు తప్ప వారు మాకు మిగిల్చిన ఆస్తి ఏంలేదు. ఇప్పటికే అమ్మాయి చదువుకి, అవసరాలకు ఈ ఇంటిమీద చాలా అప్పు చేసాము. మీ దగ్గర నిజం దాచడం నా కిష్టంలేదు. ఈ



Estd 1957 Phone : 373

...ఎల్లప్పుడూ...

మా ప్రసిద్ధి చెందిన

* జంకాళాలు, * బెడ్ షీట్లనే

ఉపయోగించండి.

ఆంధ్రప్రదేశంలో, మా ప్రతినిధిగా చేరుటకు సమర్థులైనవారి నుండి

దరకాస్తు కోరబడుచున్నాము.

: తయారించువారు :

**Rainbow Industrials**

P. B. No. 261 : : BHAVANI - 638 302.

పరిస్థితిలో అమ్మాయికి మేమేం కట్నం ఇచ్చుకోలేమమ్మా! దాని ఒంటిమీద ఉన్న నాలుక్కాసుల బంగారం తప్ప. అమ్మాయిని మీ కడుపులో దాచుకోండి!' అంటూ అమ్మ ప్రాధేయపడింది.

'బాగుంది, బాగుంది! కాణి కట్నం లేకుండా ఉద్యోగం చేసేవాడు, పైగా అందగాడు మీ అమ్మాయిని చేసుకుంటాడని ఎలా అనుకున్నారు? ఎంతో కొంత కట్నం ఇవ్వక పోరూ! అమ్మాయి అందగత్తె' అంటూ మధ్యవర్తి గొడవ చేస్తే మీ గుమ్మం తొక్కాం. మేము కావాలనుకుంటే లక్షలు వస్తాయి మా అబ్బాయికి' అంది ఈసడింపుగా ఆమె.

నేను మరి నిలవలేక పోయాను, ఒక్క ఉదుటన అక్కడకు చేరాను. నన్ను చూచి అమ్మ తెల్లముఖం వేసింది కళ్ళతోనే సైగ చేసాను.

''మిష్టర్! మీరు చదువు కున్నవారు, సంస్కారవంతులు దేనికి విలువ ఇవ్వాలో తెలుసు, అమ్మడు పోవడ మనేది ఎంత అమానుషమోకూడ మీకు తెలుసు. లేనివార్ని పీడించి కట్నం పుచ్చుకోకూడదన్న ఇంకితజ్ఞానం లేనివారు కాదు మీరు! కేవలం కట్నం కోసం ఇంత మందిని బాధ పెట్టడం భావ్యం కాదు! మా అక్కను పెళ్ళి చేసుకుని, ఆదర్శ పురుషులుగా మరొకరికి మంచి మార్గం చూచి మనిషి జన్మకు సార్ధకత కలిగించండి,'' అంటూ అతను చెప్పే జవాబు కోసం ఎదురు చూడకుండానే లోపలికి వచ్చేసాను.

అమ్మ ఇంకా ఆవిడ చేతులు పట్టుకుని ప్రాధేయ పడుతూనే ఉంది! ఆ సమయంలో అక్క కళ్ళలో నీరు నేను చూడకపోలేదు.

"ఆలోచించుకుని లెటర్ వ్రాస్తాం." అంటూ లేచాడు పెళ్ళికొడుకు! అంతా వచ్చిన పనై పోయినట్టుగా లేచి వెళ్ళి పోయారు! నేను నల్గురి ముందుకు వెళ్ళి మాట్లాడి నందుకు అమ్మ నాకు బాగా చివాట్లు పెట్టింది.

ఆ చివాట్లను లెక్క చేయకుండా నా ఆశయాలన్నీ ఏ కరువు పెట్టాను! 'అమ్మా! అక్కలా నేను నలుగురి ముందు కూర్చుని వాళ్ళు అడిగే ప్రతి అడ్డమయిన ప్రశ్నకూ జవాబు చెప్పను. నన్ను పూర్తిగా అర్థం చేసుకుని, ఆడది కూడా ఒక మనిషేనని, ఆడదానికికూడా కోరికలు, ఆశలు,


మీ కొరకు....

మేము

తయారిస్తున్నాము.

SNH

శ్రీ నిత్యా బనియన్లు

* బనియన్లు
* జెట్టీలు
* ఫేన్సీ కలర్ రకాలు

——తయారించువారు——

**Sri Nithya Hosieries**

11-C, Ramaiah Colony

TIRUPUR - 638 602.

Srockists:—

**G. K. Banians**

Vastralatha, Vijayawada-520 001.

ఆశయాలు ఉంటాయని తెలుసుకుని, ఆడదాని కూడా మగవాడితో సమానంగా స్వతంత్రత ఇవ్వాలనుకునే మనిషినే నేను పెళ్ళి చేసుకుంటాను. ఈ విషయంలో నన్నెవరూ మధ్యపెట్టలేరు.'' అంటూ నా మనసులో మాట చెప్పాను.

''నా మాటల్ని అమ్మ, అక్క తేలిగ్గా తీసిపారేసారు.

''నీ కోరికలన్నీ తీర్చేవాడు ఇంకా పుట్టి ఉండడు. ఇలా బలితెగిస్తే మన పరువు, మర్యాద ఏంకాను?'' అమ్మ నన్ను కేకలు పెట్టింది.

''ఈ మనుషుల్ని మార్చడం నా తరంకాదు! నాకు నచ్చినట్లుగా నడుచుకోవడమే తేలిక.'' అనుకుంటూ అక్కడ్నుండి వెళ్ళిపోయాను

* * *

పెళ్ళికొడుకు దగ్గరనుండి లెటర్ వచ్చింది. ఆ లెటర్ నా పేరున రావడంతో ఆశ్చర్యపోయాను. ఏం వ్రాసాడో నన్న ఆతృతతో కవరు విప్పాను. నాదృష్టి అక్షరాల వెంట పరుగుదీసింది—

''స్వప్నగారూ!

నాకూ... మీలా కొన్ని స్వతంత్ర భావాలు ఉన్నాయి, మా అమ్మగార్కి ఎదురు చెప్పే ధైర్యం లేక ఆ రోజు నేనేమీ మాట్లాడలేక పోయాను. మీ అక్కయ్య నాకు నచ్చింది. మీ అమ్మగారితో సంప్రదించి ముహూర్తం నిర్ణయించండి.

ఉంటాను,
సుధాకర్

నా సంతోషానికి అవధులు లేవు. పరుగున వెళ్ళి అక్కను చుట్టేసాను. విషయం విన్న అక్క సిగ్గుతో, సంతోషంతో ఉక్కిబిక్కిరి అయ్యింది.

ఈ మాటలు వింటూనే కళ్ళు తేలేసింది. నోరెళ్లబెట్టింది అమ్మ. అమ్మ దగ్గరగా వెళ్ళి తెరచిన నోటిని మూసి వచ్చాను.

''ఎంత అల్లరిపిల్లవే! ఆ వచ్చేవాడు నిన్ను ఎలా భరిస్తాడో?'' అంటూ సంబరంగా అటూ ఇటూ తిరిగింది.

నేను కాలేజీకి వెళ్ళినా అక్క పెళ్ళి సంగతే పదేపదే గుర్తు రాసాగింది. అక్కకు ఎన్నో సంబంధాలు వచ్చాయి. అక్కకు చదువు తక్కువని, కట్నం ఇవ్వలేమని ఎవ్వరూ అక్కను పెళ్ళిచేసుకోడానికి ముందుకు రాలేదు. అక్క అందం కంటే ఈ రెండే ముఖ్యమయినవని అప్పుడే తెలుసుకున్నాను.

నా మనసుకు నచ్చినవాణ్నే నేను పెళ్ళిచేసుకుంటానని నా ఫ్రెండ్స్‌తో చెప్పినపుడు వాళ్ళునన్ను ఆటపట్టించేవారు. హేళన చేసేవారు. ''పెళ్ళికాని ప్రతి ఆడదీ అనే మాటే ఇది. పెద్దల ఇష్టం లేకపోతే వాళ్ళ ఆశయాలు ప్రక్కన పెట్టి, తల వంచుకుంటారు. ఇలా ఎందుకయిందని ఎవ

NOVEL DIAMONDS
NOVEL DIAMOND WORKS

నోవెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు
విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.
అన్ని విధములైన కలర్ కమలములూ
మా వద్ద దొరుకును.
మా వజ్రములకు గ్యారంటీ ఇవ్వబడును.

: వివరములకు :

Phone No. 27468

Novel Diamond Works

7-A/2, North Sowrastra St. : : TIRUCHIRAPALLI-620 008.



రయినా అడిగితే పరిస్థితుల ప్రభావం అంటూ తప్పించుకుంటారు.'' ఈ విధంగా నన్ను చెప్పేవారు. నాటి స్త్రీయే నాతో ఏకీభవించలేకపోయినందుకు బాధ అనిపించేది. ఏదయినా మంచి పని చేయాలనుకున్నపుడు నలుగురూ ఒక మార్గాన పయనిస్తేనే ఆ పని సాధించగలం. ఇలా ఎవరి స్వార్థం వాళ్ళు చూచుకున్నన్ని రోజులూ స్త్రీ అట్టడుగున ఉండవలసిందే! ఇలా ఎన్నో ఆలోచనలతో గడిపేదాన్ని.

* * *

అక్క పెళ్ళి ముహూర్తం నిశ్చయించారు. అనుకున్న దానింంటె బాగానే జరికింది అక్క పెళ్ళి. అక్క ముఖంలోని వెలుగును చూచి పొంగిపోయాను. బావగారు మంచి మనసుతో అక్కను స్వీకరించినందుకు కృతజ్ఞతలు చెప్పకున్నాను.

చుట్టాలంతా వెళ్ళిపోయారు. అక్క అత్తవారింటికి వెళ్ళింది మొదటిసారిగా. అక్క వెళ్ళిపోవడంతో ఇల్లంతా చిన్నబోయింది.

అక్క వెళ్ళిపోయాక అమ్మ కూడా ఏదోలా వుండేది. రానురాను మేమిద్దరం ఆ వాతావరణానికి అలవాటు పడిపోయాం. కాలేజీకి వెళుతూ వస్తూ రోజులు గడిపేదాన్ని. అప్పుడప్పుడు అక్కకు లెటర్స్ వ్రాస్తుండేదాన్ని. అక్క చా — తర్చుగా లెటర్స్ వ్రాసేది.

ఉ న్నట్టుండి అప్పులవాళ్లు ఇంటిమీద పడ్డారు. వడ్డీలమీద వడ్డీలు పెరిగి అప్పు చాలా మొత్తంగా, భయంకరంగా బయట పడింది. ఏమీ చేయలేని నిస్సహాయత స్థితిలో చూస్తూండి పోయాం అమ్మా, నేను!

నేను ముందుగా తేరుకుని-

''అయ్యా! మేము మీ అప్పు ఒక్కసారిగా తీర్చలేం. ఈ సంవత్సరంతో డిగ్రీ పూర్తి అవుతుంది. ఆ తర్వాత ఏదయినా ఉద్యోగం సంపాదించుకుని, నెలనెలా ఎంతో కొంత మీ బాకీ తీర్చేస్తాను! దయుంచి కొన్ని రోజులు ఓపిక పట్టండి!'' అని ఎప్పుడూ ఎవ్వరినీ ప్రాధేయపడని నేను ఆ రోజు ప్రాధేయపడ్డాను.

నా మాటలు వాళ్ళకు వినిపించలేదు! మమ్మల్ని ఇంటి నుండి వెళ్ళగొట్టి, ఇంటిని వేలంవేసారు! చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని అమ్మ, నేను కాలం గడపసాగాం. అమ్మ ఏదో పనులుచేసి డబ్బు సంపాదించేది. ఆ డబ్బు అద్దెకు, మా పొట్టకే సరిపోయేది కాదు! ఇక నా చదువుకు స్వస్తిచెప్పి, అమ్మకు సాయపడాలనుకున్నాను.

ఉద్యోగం కోసం ఎన్నో చోట్లు తిరిగి, అవమానపాలయ్యాను! "లంచం ఇవ్వనిదే ఉద్యోగం లేదని" ఖచ్చితంగా చెప్పేవారు. చివరికి నా విద్యను పదిమంది పిల్లలకు పంచి, అమ్మకు సాయపడేదాన్ని.

[సశేషం]

Phone: 21386 Office: 23243



Saradha

KNITTING MILLS

TIRUPUR - 638 602